# మంగమ్మగారు మైసూరు సిల్క్ చీర

"అమ్మా! మా ఆఫీసు చాలా దూరం కదా! మధ్యలో రావాలంటే వీలు పడదు. మీ అల్లుడు వచ్చి నిన్ను ఎయిర్‌పోర్టులో వదలుతారు. నువ్వు అనవసరంగా ఎక్కువ సామాను సర్దుకోకు. ఇవాళ వెళ్తే రేపు రాత్రికి వచ్చేస్తావు.




ఇవాళ రాత్రి వేసుకోడానికి ఒక నైటీనో లేక నూలు చీర, రేపు పెళ్ళి టైముకు కట్టుకోడానికి ఒక పట్టుచీర, వాళ్ళకు ఇవ్వడానికి కొన్న గిఫ్ట్ క్యారీ బ్యాగ్‌లో

పెట్టుకుంటేచాలు. నువ్వేమీ కంగారు పడకు ఒంటరిగా వెళ్తున్నానని. ఇక్కడ మీ అల్లుడు విమానం ఎక్కిస్తాడు. అక్కడ మీ చెల్లెలో లేక ఆమె కొడుకుల్లో ఒకరు వచ్చి రిసీవ్ చేసుకుంటారు. హేవ్ ఎ నైస్ టైమ్. నేను బయల్దేరుతున్నా: బై" అని కారెక్కింది చిన్ని.

చేతిలోవున్న పెళ్ళి కార్డువైపు మరోసారి చూశారు మంగమ్మగారు. ఒక పుస్తకంలా వున్నదా కార్డు. మొదటి పేజీలో పెళ్ళి కొడుకు పెళ్ళి కూతుళ్ళ ఫోటోలున్నాయి. 'జంట చూడముచ్చటగా వున్నారు' అనుకున్నారు మంగమ్మగారు. "మూడో కొడుకు కూడా మా చిన్నాన్న పోలికే" అనుకున్నారు మళ్ళీ.

రెండవ పేజీలో పెళ్ళికూతురి తరపునుండి ఆహ్వానం వుంది. మూడవ పేజిలో పెళ్ళి కూతురి వైపు వారికి ఏఏ హోటళ్ళలో గదులు బుక్ చేశారో వివరాలు, ఫోను నెంబర్లు, ఆ హోటల్‌లో వుండే లొకేషన్‌తో సహా ఇచ్చారు.

నాలుగో పేజీలో పెళ్ళి కొడుకు తల్లిదండ్రుల పెళ్ళి పిలుపు' అయిదో పేజీలో చక్కని బొమ్మ ఆరో పేజీలో వాళ్ళు ఏర్పాటు చేసిన విడిది గదుల వివరాలు? ఏడు ఎనిమిది పేజీలలో పెళ్ళి సందర్భంగా ఏర్పాటు చేసిన సంగీత విభావరి కార్యక్రమాలు, డాన్స్ ప్రోగ్రాముల గురించిన వివరాలు వున్నాయి.

"పెళ్ళి పత్రికలు అచ్చువేయించడానికే బోలెడంత ఖర్చు పెట్టారు. ఇక పెళ్ళెంత గ్రాండ్‌గా చేస్తారో" అనుకున్నారు మంగమ్మగారు.

మంగమ్మగారి పిన్ని కూతురు వాళ్ళు అమెరికాకు వచ్చి స్థిరపడి ముప్ఫై ఏళ్ళు దాటింది. పెద్దమ్మాయికి, ఆ తరువాతి వాడికి ఇండియాలోనే పెళ్ళి చేసింది. ఆఖరు అబ్బాయి పెళ్ళి మాత్రం ఎంచేతో అమెరికాలో చేస్తోంది.

ఎన్ని కోట్లు సంపాదించినా ఎంత గొప్పగా బ్రతుకుతున్నా పిన్ని కూతురిలో భేషజాలు లేకపోవడం, ఎప్పటి అప్యాయతే కనబడడం మంగమ్మగారు ఒంటరి ప్రయాణం చేసి అయినా పెళ్ళికి వెళ్ళాలనుకోవడానికి ముఖ్య కారణం.

పెళ్ళి పత్రిక అందిన రోజే ఫోను చేసింది తను. తప్పకుండా రావాలనీ, రానూపోనూ టికెట్లు (విమానంలో) తానే బుక్ చేస్తాననీ అన్నది. ఆ అభిమానం చూశాక కాదనలేకపోయారు మంగమ్మగారు.

"టికెట్లు పెట్టుకుని మరీ పిలిపించాలటే... నా కూతురూ కాస్తో కూస్తో సంపాదిస్తోందిగా, ఆ మాత్రం ఖర్చుపెట్టి పంపిస్తుందిలే. నేను

వచ్చేముందు ఫోను చేస్తాను. ఎయిర్ పోర్టుకు ఎవరినన్నా పంపించు చాలు. మరో మాట ఎవరో గెస్టుని దింపినట్టు నన్ను ఎక్కడో హోటల్లో దింపకు. నీ దగ్గరుండి పెళ్ళి చూడాలని వస్తున్నాను." అని చెప్పేశారు మంగమ్మగారు. అమ్మా నాన్నలిద్దరికీ ఫ్లోరిడాకు టికెట్లు బుక్ చేసింది చిన్ని. పెళ్ళి జరిగేది 'మియామీ'లో. పక్కన మంగపతిగారు వుంటే ప్రపంచంలో ఏమూలకి వెళ్ళడానికైనా ధైర్యంగా బయల్దేరుతారు మంగమ్మగారు. 'యోగక్షేమం వహామ్యహం' అని ఆయనమీద భారం వేసి నిశ్చింతగా ప్రయాణానికి సిద్ధమైపోతారు.

తీరా ప్రయాణానికి రెండ్రోజులు వుందనగా ఆయనకు జ్వరం రావడంతో తను రాననీ ఆవిడని వెళ్ళి రమ్మనీ చెప్పేశారు. ఒక టికెట్ కాన్సిల్ చేసేసింది చిన్ని.

ఇదీ ముందు జరిగిన సంగతి. ఈరోజు ప్రయాణం గనుక తల్లికి అన్ని జాగ్రత్తలూ చెప్పి ఆఫీసుకు వెళ్ళింది చిన్ని.

కూతురు చెప్పినట్టే ఒక కంచి పట్టుచీర, ఒక సాదా నూలు చీర బ్యాగ్‌లో సర్దుకుందావిడ. వాళ్ళకోసం కొన్న వెండి పళ్ళెం కూడా పెట్టుకుంది మరచి పోకుండా. ఇక తనకు కావల్సిన బొట్టు కాటుక దువ్వెనలాటివి ఎలాగూ హ్యాండ్ బ్యాగ్‌లోనే పెట్టేసింది.

ఇకపోతే ప్రయాణానికి ఏం చీర కట్టుకోవాలా అన్న ఆలోచనలో పడిందావిడ. వెడుతున్నది చాల ఆర్భాటంగా జరగబోతున్న పెళ్ళికాయె. ఎయిర్ పోర్టు నుండి తిన్నగా పెళ్ళి జరిగే చోటికే వెళ్తుంది. ఎలాగూ ఈ రాత్రికే ఎదుర్కోళ్ళు అవీ వుంటాయి. ఇవన్నీ ఆలోచించి ఒకేసారి మంచి చీరె కట్టుకుని వెడితే అన్నిటికీ సరిపోతుంది అన్న నిశ్చయానికి వచ్చేశారు మంగమ్మగారు.

మరీ గాడీగా కనబడకుండానే ఖరీదైనదిగా కనబడుతూ ప్రయాణంలోనూ సుఖంగా ఒంటికి హాయిగా వుండే మైసూరు సిల్క్ చీరె కట్టుకుంటే హాయి అనుకుంటూ ఛాయ పసుపురంగు చీరకు మెరూన్ కలర్ బార్డర్ అరచేయి వెడల్పున మామిడి పిందెల జరీ బార్డర్ వున్న చీరె కట్టుకుని ప్రయాణానికి సిద్ధమైన దామె.

చిన్ని చెప్పినట్టుగానే మధ్యాహ్నం అల్లుడు వచ్చి ఆవిడను ఎయిర్ పోర్టుకు తీసుకువెళ్ళాడు.

పిట్స్‌బర్గ్ ఎయిర్‌పోర్టు ఆవిడకు చాల నచ్చేసింది. బయటంతా పచ్చని చెట్లు, లాన్స్, లోపలికి అడుగుపెడితే కళ్ళు చెదిరే అందంతో ఎయిర్ పోర్ట్ లాంజ్.

'చెకిన్' చేయడానికి సామానేమీ లేదు గనుక వున్న ఒక్క బ్యాగ్ ఆవిడ దగ్గరే వుంచుకుంది. మరో రెండు గంటల వరకు ప్రయాణీకులను సెక్యూరిటీ చెక్ జోన్‌లోకి రానివ్వరు గనుక తను బయల్దేరి ఆఫీస్‌కి వెళ్తానని 'హ్యాపీ జర్నీ అత్తయ్యా' అనేసి వెళ్ళిపోయాడు అల్లుడు.

అతను వెళ్ళిపోయాక అలా తిరిగి చుట్టూవున్న షాపులూ అవీ చూస్తూ కాలం గడిపేసిందావిడ.

ఫ్లైట్ టైముకు ముప్పావుగంట ముందు నుండీ ప్రయాణీకులు సెక్యూరిటీ చెక్ ముందు 'క్యూ' కట్టారు.

మంగమ్మగారు కూడా మెల్లిగా అటు నడిచారు. మనసులో ఎంత కంగారుగా వున్నాపైకి గంభీరంగా వుండడానికి ప్రయత్నిస్తున్నారు. ఒంటరిగా విమాన ప్రయాణం చేయడం ఇదే మొదటిసారి ఆవిడకు.

'సరే ఇక్కడ ఎక్కితే అక్కడ దిగడమేకదూ!' అని తనకు తానే ధైర్యం చెప్పుకుంటున్న దావిడ.

'క్యూ' లో తన వెనుకగా వున్న ఒక ఇండియన్ స్త్రీని చూసి పలకరింపుగా నవ్విందావిడ. కానీ ఆ అమ్మాయి మాత్రం ఈవిడ వైపు ఒకసారి చూసి చూపు తిప్పుకుంది.

మనవాళ్ళకన్న అమెరికన్లే నయం, 'హాయ్' అనేసి పోతుంటారు పరిచయం వున్నా లేకపోయినా అనుకుంటూ నెమ్మదిగా ముందుకు నడిచారు మంగమ్మగారు.

తన కాబిన్ లగేజిని సెక్యూరిటీలో నుండి లోపలికి పంపడానికి బల్లమీద పెట్టి, పక్కన వున్న ట్రే తీసుకుని అందులో తన హ్యాండ్‌బ్యాగ్, వాచీ, చేతిగాజులు అన్నీవేసి ఆ ట్రే కూడా లోపలికి వెళ్ళేట్టు పెట్టిందావిడ.

అటు పక్కగావున్న మెటల్ డిటెక్టర్ ద్వారంకుండా లోపలికి రమ్మని సైగ చేశాడు అక్కడున్న ఉద్యోగి.

మెల్లిగా అటువైపు నడిచి ఆ ద్వారంలో నుండి వెళ్ళబోతూ లోపలివైపు పెద్ద గన్స్ పట్టుకుని నిలబడిన ఇంతెత్తున వున్న సెక్యూరిటీ ఆఫీసర్లని చూడగానే ఆవిడకు గాభరాగా అనిపించింది.

మనసు గట్టి చేసుకుని లోపలికి అడుగుపెట్టింది. వెంటనే ఆగకుండా అలారమ్ మ్రోగడం మొదలుపెట్టింది. ఆవిడ కంగారుగా వెనక్కి వెళ్ళబోతుంటే "నో... నో..." అని అరుస్తూ ఆవిడకు ఇటూ అటూ వచ్చి నిలబడ్డారు గన్ పట్టుకున్న వాళ్ళు.

ఏమయితే అయిందనుకుని లోపలికే నడిచారు మంగమ్మగారు. ఇంతలో ఎక్కడినుండో ఒక ఆడ సెక్యూరిటీ ఆఫీసరు మరో ఇద్దరు ఆడ పోలీసులతో వచ్చి "కమ్ దిస్ వే" అంటూ ఆవిడకు దారి చూపించారు.

"మై హ్యాండ్ బ్యాగ్... మై వాచ్... మై బ్యాంగిల్స్ అంటూ గొణిగారావిడ.

"యు టేక్ దెమ్... అండ్ కమ్ దిస్ వే." అంటూ మంగమ్మగారు గాజులు, వాచ్ తీసుకున్నాక ఆవిడ హ్యాండ్ బ్యాగ్ ఒక పోలీసు తీసుకుంది.

చాలా జాగ్రత్తగా ఆవిడకు కాస్త దూరంలో నిలబడి తన చేతిలో వున్న మెటల్ డిటెక్టర్‌తో ఆవిడను పైనుండి క్రింద దాకా స్కాన్ చేసిందా ఆడ ఆఫీసరు. అంతసేపూ వాళ్ళు చెప్పినట్టు చేతులు జాపి వుంచారు మంగమ్మగారు. సెక్యూరిటీ ఆఫీసరు చేతిలోని మెటల్ డిటెక్టరు ఆగకుండా మోగుతూనే వుంది.

మంగమ్మగారిని చేతులు బార్లా జాపి వుంచమని ముందుకు నడిపించి పక్కన వున్న గదిలోకి తీసుకు వెళ్ళింది.

లోపలికి వెళ్ళాక "డోంట్ మూవ్ యువర్ హ్యాండ్స్" అంటూనే ఇద్దరు ఆడ పోలీసులు మంగమ్మగారిని పైనుండి క్రింది వరకు తడిమి చూశారు.

"డు యు హేవ్ ఎ గన్?" అనడిగింది ఆఫీసరు.

"గన్? నో నో సీ..." అంటూ చేతులు ముందుకు జాపబోయారు మంగమ్మగారు.

"డోంట్ మూవ్" అంటూ అరిచిందామె. చీర కుచ్చిళ్ళకు బార్డరు వున్నంతమేరా గుండెలమీద నుండి వచ్చిన పైట కొంగు బార్డరు వున్నంతమేరా దగ్గరగా తీసుకురాగానే ఆ మెటల్ డిటెక్టరు అరుస్తూనే వుంది.

సడన్‌గా లైటు వెలిగినట్టు మంగమ్మగారికి విషయం అర్థమయింది.

"సీ దిస్ శారీ బార్డర్ ఈజ్ మేడ్ ఆఫ్ ప్యూర్ సిల్వర్ అండ్ గోల్డ్.. వెరీ ఫేమస్ ఇన్ ఇండియా. దిసీజ్ మైసూర్ శిల్క్ శారీ..." కంగారులో కాస్త తడబడుతూ చెప్పింది ఆవిడ.

మంగమ్మగారు ఎదురుచూసినట్టుగా ఆ ఆఫీసర్ ముఖంలో మెచ్చుకోలుగానీ, అలాగా అన్న భావంగానీ కనబడలేదు. అలాగే రాతిబొమ్మలా ముఖంలో ఏ భావం లేకుండా "చెక్ దట్ హ్యాండ్ బ్యాగ్..." అని చెప్పింది అసిస్టెంట్స్‌కి.

వాళ్ళలో ఒకామె మంగమ్మగారి హ్యాండ్ బ్యాగ్ తెరిచి అందులోని వస్తువులను ఒక్కోటి చాల భయంగా జాగ్రత్తగా బయటకు తీయసాగింది.

అలా తీస్తుండగా చిన్న పండు పరిమాణంలో వున్న వెండి భరిణ ఆమె చేతుల్లో నుండి జారిక్రింద పడిపోయింది. మూత ఊడి పక్కకు దొర్లిపోయింది.

ముగ్గురు ఆఫీసర్లూ ఒక్క గంతువేసి వెనక్కి వెళ్ళి పడిపోయిన భరిణ వైపు అది ఏ క్షణంలో పేలుతుందోనన్నట్టు చూస్తున్నారు.

అంత టెన్షనులోనూ వాళ్ళ ముఖాలు చూస్తుంటే మంగమ్మగారికి నవ్వొచ్చింది.

"దటీజ్ మై కాజల్ బాక్స్... సీ..." అంటూ చట్టుక్కున వంగి దాన్ని చేతిలోకి తీసుకున్నదావిడ.

"డోంట్ డూ ఎనీ థింగ్" అంటూ గభాలున గన్ తీసి మంగమ్మగారికి గురి పెట్టింది ఆఫీసర్.

అంతలోనే కాటుక భరిణలోని కాటుక చేతికంటుకోవడం వలన భరిణ క్రిందకి వదిలేసి ..ఐ అప్లై ఇట్ టుమై ఐస్" అంటూ వ్రేలికి వున్న కాటుకను కంటికి పెట్టుకున్న దావిడ.

ఆఫీసర్లు ముగ్గురి ముఖాల్లో రిలీఫ్ కనబడింది. అంతలో వేలికి మిగిలిన కాటుక పాపిట దగ్గర పూసుకున్నది మంగమ్మగారు.

"వాటార్యూ డూయింగ్?" అనుమానంగా అడిగింది సెక్యూరిటీ ఆఫీసర్.

"దిస్ కాజల్ విల్ కవర్ మై గ్రే హెయిర్.. జస్ట్ లైక్ హేర్ డై' అంటూ వివరించారు మంగమ్మగారు. ఆఫీసరు నవ్వనని ఒట్టుపెట్టుకున్నట్టు కోల్డ్‌గా ఆవిడవైపు చూసి "లెట్ హర్ గో" అంది మిగతా ఇద్దరితో.

బ్రతుకు జీవుడా అనుకుంటూ హ్యాండ్ బ్యాగ్ తీసుకుని, క్యాబిన్ లగేజి లాక్కుంటూ ప్లేన్ వైపుకు నడిచారు మంగమ్మగారు.

సీట్లో కూర్చున్నాక కూడా ఆవిడకు గుండెదడ తగ్గలేదు. "వీళ్ళ పెళ్ళి బంగారంగానూ... దర్జాగా వుండాలన్న ఆశతో ఈ సెక్యూరిటీ చెక్‌ల గురించి ఆలోచన లేకుండా జరీ చీర కట్టుకు వచ్చి వీళ్ళ చేతుల్లో చిక్కాల్సి వచ్చింది. ఇంకోసారి బుద్ధివుంటే జరీ చీరలు విమాన ప్రయాణాలకి కట్టకూడదు" అనుకుని మనసులోనే లెంపలు వాయించుకున్నదామె.

"పెళ్ళి కోసం కంచి పట్టుచీర తెచ్చుకుంది. దాన్నిండ కూడా జరీ వుంది. పెళ్ళికి ఏదో ఒక చీర పెట్టుకపోదు చెల్లాయి. వాపస్ వచ్చేటప్పుడు అది కట్టుకోవాలి. అనుకుంది మళ్ళీ.

***

పెళ్ళింట్లో అడుగు పెట్టిన మంగమ్మగారిని చూడగానే "వావ్ లవ్‌లీ శారీ" అంటూ అక్కను కౌగిలించుకుంది పెళ్ళి కొడుకు తల్లి మంగమ్మగారి పిన్ని కూతురు.

"ఇదెన్ని తిప్పలు పెట్టిందో నీకేం తెలుసు?" అనుకుంటూ సింగి నవ్వు నవ్వారు మంగమ్మగారు.

పెళ్ళి బ్రహ్మాండంగా జరిగింది. ఆ సంతోషంలో నిన్నటి గొడవ మరచిపోయారు మంగమ్మగారు.

ఆవిడ బయల్దేరే ముందు బొట్టు పెట్టి చీరె ప్యాకెట్టు అందించింది చెల్లెలు "పచ్చని నీ ఒంటిఛాయకు బాగా నప్పుతుందని ఎమ్.ఎస్ బ్లూ కలర్ కొన్నాను చూడు" అంటూ అట్టపెట్టి తెరచి చూపించింది.

రంగు ఎమ్.ఎస్. సుబ్బలక్ష్మిగారు కట్టే బ్లూ రంగే గానీ చీర మాత్రం మామిడి పిందెల జరీ బార్డరున్న అచ్చమైన మైసూరు సిల్కు చీర!